
పట్టణానికి పదిమైళ్ళ దూరంలో వుండడం వల్ల ఆ దేవాలయానికి అధికార్లు, రాజకీయ నాయకుల తాకిడి కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఎవరొచ్చినా అట్టహాసం చేయక తప్పదు...

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉడయవర్లుకి ఇంతదాకా ఏ బాదరబందీలు లేకుండా గడిచిపోయింది. కాని, ప్రమోషన్ పేరుతో ఈ దేవాలయానికి వచ్చిన ఉడయవర్లకి కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి.

# లోగుట్లు

కె.కె. రఘునందన



రోజూ ఉదయం మొదలు ఎవరో ఒకరు ఫోన్ చేయడం... ఏవేవో చచ్చు ప్రశ్నలు వేయడం... ప్రసాదం కె.జి. ఎంత? ముందుగా ఆర్డరివ్వాలా? దేవాలయం ఏ రోజుల్లో ఖాళీగా వుంటుంది? కొప్పు టిక్కెట్టు ఎంత? అని ఈమధ్య ఫోన్ల దాడి మరీ ఎక్కువైంది.

ఏదో ఓ కార్యాలయం నుంచో, ఏదో పార్టీ తరఫువాళ్ళనుంచో, మంత్రుల పి.ఏల దగ్గర్నుంచో, వాళ్ళ రాకను తెలియజేస్తూ, తమకి ఘనస్వాగతం పలకాలని ... ప్రసాదాలు భోగ్యంగా వండాలనీను...

మరికొందరేమో చెప్పాపెట్టకుండా వలసపక్షుల్లా వాలిపోవడం కూడా మామూలైపోయింది.

ఉడయవర్లు వచ్చాక జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు ఇవే..! నవమాసాలు మోసే తల్లిలా భరించాల్సిందే ఈ తొమ్మిది రోజులూను.

ఈ ప్రాంతం కొత్త ఉడయవర్లుకి. ఎవరితో ఎలా మసలుకోవాలో తెలీదు. ఊరి ఆనవాయితీలు అడిగి తెలుసుకోవాలని గుమాస్తా అప్పలాచార్యులను పిలిపించాడు.

అతగాడు అప్పుడే పోటుశాల నుంచి పళ్ళు పటపటలాడించుంటూ వచ్చి – ''ఆ పట్టాభికి ఎంత తిమ్మిరిగా వుందని? అర్చకస్వామి గోవిందాచార్యులతో మాట్లాడే పద్ధతేనా? తాలింపు చెడగొడ్తున్నావని అంటే తప్పా! భక్తులు ఉమ్మేయరూ! ఛఛ!!'' అన్నాడు.

''పట్టాభి కుర్రాడు కదా! ఉడుకురక్తం... నే చూసుకుంటాన్లెండి. ఇంతకీ నవమికి ఎవరెవరు వస్తారో ఓ లిస్టు రాసుకుందాం... ప్రసాదాలు ఏమాత్రం వుండాలో కూడా ఎస్టిమేషన్ వేసుకుంటే బావుంటుంది'' అన్నాడు ఉడయవర్లు అప్పలాచార్యులు కూర్చున్నాక.

తన గత అనుభవాలు దృష్టిలో పెట్టుకుని వివరాలు అందించాడు అప్పలాచార్యులు.

ఈలోగా అక్కడికి చేపాటి కర్ర సాయంతో వేంచేశారు స్థానాచార్యులు వైకుంఠంగారు. ఆ ఆలయంతో అరవయ్యేళ్ళ అనుబంధం వున్న ఆయన ఆనుపానులు తెలిసిన మనిషి.

వైకుంఠం గారలా కూర్చోగానే ఫోన్ గణగణమన్నది. అప్పలాచార్యులు ఫోన్ అందుకుని 'మీతోనే మాట్లాడతారట..' అని ఇ.వో. గారికి అందించాడు.

ఓ నిముషం మాట్లాడేసరికి ఉడయవర్లుకి ముచ్చెమటలు పట్టేశాయి.

''ఎందుకండీ! హైరానా పడిపోతున్నారు. ఇంతకీ ఏమైందని!'' ఆయన అవస్థ గమనించి వైకుంఠం గారడిగారు.


''కలెక్టరొస్తున్నాడండీ... ఆఫీసు వాళ్ళు ఫోన్ కొట్టారు. అది కూడా ఈ తొమ్మిది రోజుల్లో ఏదో ఓరోజున...'' కంగారంతా ఉడయవర్లు మొహం మీద తచ్చాడుతోంది.

దానికి నవ్వేసి – ''ఓస్! దీనికి అంత కంగారెందుకండీ... ఎలాగూ అటువంటి పెద్ద అధికార్లకి పూర్ణకుంభ స్వాగతం పలకడం, ఆలయ మర్యాదలు చేయడం, ముఖస్తుతికి నాలుగు మాటలాడటం... అంతే కదా!'' అనేశారు వైకుంఠంగారు తేలిగ్గా.

''అలా తీసిపారేయకండి. ఈ కలెక్టర్ కుర్రాట్ట. ఎవరి మాటలు వినట్ట. ఏమాత్రం లోటుపాట్లొచ్చినా సస్పెండ్ చేసిపారేస్తాట్ట'' గింజుకున్నాడు ఉడయవర్లు.

''నా అనుభవంలో ఎంతోమంది కలెక్టర్లను చూశాను. మన వైదిక స్వాముల రీతిరివాజులను ఎవరాక్షేపించగలరని. ఇంక ఆఫీసు సైడంటారా? చెక్ చేసుకోవడానికి మీరేం తప్పుగా నడిస్తే కదా. నేనెలా తేనెలు కురిపిస్తానో చూద్దురూ...'' అని వైకుంఠం గారిచ్చిన ధైర్యంతో ఉడయవర్లు చల్లబడ్డాడు.

''కలెక్టర్ సరే... ఇక రాజకీయ నాయకులు వస్తేనే మహా ఒత్తిడి. పూర్ణకుంభంతో స్వాగతం పలకాలం



## గాడ్‌ఫాదర్లు లేరు

సవేతా సాల్వే టీవీ రంగంలో సెక్స్‌బాంబ్. ఎవర్నీ లెక్కచేసే రకం కాదు. 'కిట్టీ పార్టీ, లిప్‌స్టిక్' సీరియల్స్‌తో పేరు తెచ్చుకున్న సవేతా తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి వుంటోంది.' పెళ్ళి గిళ్ళి అనేవి పాతమాటలు. రాబోవు రోజుల్లో 'లివింగ్ టుగెదర్' జంటలే ఎక్కువగా వుంటాయని అంటోంది. బుల్లితెరపై ఎక్స్‌పోజింగ్‌కి ఏమాత్రం వెనుకాడని సవేతా ప్రస్తుతం సినిమా ఛాన్స్‌లకోసం ప్రయత్నిస్తూ వుంది. సవేతాకెవరూ గాడ్‌ఫాదర్లు లేరట. అందుకే సినిమా అవకాశాలు రావడం లేదంటోంది.

టారు. వరివేట్టాలు చుట్టాలంటారు. పల్లకీలో ఎదురు సన్నాహాలొకటి. తెలివిమీరిపోయారు. వంది, మార్బలమంతటికీ ప్రసాదాలు ప్యాకింగ్ చేయమంటూ దబాయిస్తారు. హుండీలో వేసింది మాత్రం హుళక్కి, పైగా టిక్కెట్ ఫ్రీ'' మహా అక్కసుగా అన్నాడు అప్పలాచార్యులు.

ఈ ఊపుతాపులేవీ ఉడయవర్లుకింతదాకా అనుభవంలోకి రాలేదు. గతంలో ఇ.వో. శర్మ ఎలా వేగేవాడో అర్థంకాలేదు.

ఆలయ మర్యాదల విషయంలో సంపూర్తిగా వివరణ ఇచ్చారు వైకుంఠం గారు. ''వంశపారంపర్య ధర్మకర్తలకీ, మహారాజ కుటుంబాలకీ తప్ప మరెవరికీ పూర్ణకుంభ స్వాగతానికి అర్హత లేదు. అయితే ఈ ఆనవాయితీ కూడా ఆధునిక పోకడలకి దారితీసి మంత్రివర్యులకీ, ఉన్నతాధికార్లకీ అవకాశమిచ్చింది.''

''ఈమధ్యన ప్రతివాడికి యిదో హాబీ అయిపోయింది. ముందో ఫోన్ కొట్టడం, లేదా ఎవడినో పంపడం...ఛఛ'' విసుక్కున్నాడు అప్పలాచార్యులు.

ప్రధానార్చకులు గోవిందాచార్యులు ఇదంతా విని కల్పించుకుని ''సందర్భం వచ్చింది కాబట్టి చెబుతున్నాను. మొన్నామధ్య ఓ ఛోటా నాయకుడొచ్చి మా దొరగారు వస్తున్నారు. వారికి ఎదురు రావటానికి ... అదేంటో కుంభమంట... అది పట్టుకుని రావాలని చెప్పారు. ఆ ఏర్పాట్లేవో చూడండి అన్నాడు. నాకు నసాళానికి అంటిందిగాని, ఏం చేస్తాం. తలమ్ముకున్న బతుకులు మనవి. ధృవుల వద్దనుండీ పూర్ణకుంభం ప్రతి అల్లాటప్పాగాడికి సమయం, సందర్భం లేకుండా తీసుకుపోగలమాని... ఎంత అపచారం?'' తెగ వాపోయాడు.

వైకుంఠం గారు నవ్వి ''వాడి మొహం! ఈ ఆలయ మర్యాదలు భ్రష్టుపట్టించాలని చూస్తాడా!! అబ్బబ్బ!! ఆ రోజులు ఎంత బాగుండేవని! విజయనగరం మహారాజా వారు పూర్ణకుంభ స్వాగతం అంకుని దండ ధరించి వరివేట్టం (శేషవస్త్రం) చుట్టుకుని ప్రదక్షిణ చేస్తూ ఠీవిగా నడుస్తుంటే... నా సామి రంగా ఎంత హుందా, ఎంత అద్భుతం... ఆ వైభోగం మరి రాదు'' గత స్మృతుల బృందావనంలో విహరించారు.

''ఆరోజుల్తో ముడిపెట్టకండి స్వామీ! ఇప్పుడు ప్రతివాడు ఎవడికివాడే రాజు'' వ్యంగ్య బాణం విసిరాడు అప్పలాచార్యులు.

''అడియేన్ దాసోహం...!!'' పట్టి తిరుమణితో ఎదురైన శాల్తీని చూసి అటుతిరిగారు వైకుంఠం గారు.

ఎవరన్నట్లు చూసిన ఉడయవర్లుకి – ''వైకుంఠం గారి శిష్యుడు దాసు. ప్రతిఏటా కంచినుంచి వచ్చి మన స్వామిని దర్శించుకుంటాడు'' అన్నాడు గోవిందాచార్యులు.

శిష్యుడు దాసుతో గర్భగుడి వైపు కదిలారు వైకుంఠం గారు.

అప్పుడే ఫోన్ గణగణమంటూ...

ఈసారి ఉడయవర్లు ఎత్తాడు. మరెవరో కాదు. ఎంపిగారి పి.ఏ. నవమి ఆహ్వానం అందిందని, ఎం.పి. గుడికి రాగానే పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలకాలని, పూజాదికాలు భారీగా జరపాలని ఆర్డరేశాడు. ఏరోజు వచ్చేది చెప్పలేడంట. చక్కెర పొంగలంటే మహాప్రీతిట. జీడిపలుకులు దండిగా వేసి బెల్లంతో వండాలని చెప్పాడు.

తలపట్టుకున్నాడు ఉడయవర్లు.

''ఎవరు సార్!'' అడిగాడు అప్పలాచార్యులు.

చెప్పాడు ఉడయవర్లు.

''అప్పుడే ఏం చూశారు. ముందుంది ముసళ్ళ పండుగ'' అనేసి మాడువాసన తగిలి పట్టాభిని కేకలేయడానికి పోటుశాల వైపు కదిలాడు అప్పలాచార్యులు.

మరోక్షణంలో మరల ఫోన్... భయంగానే ఎత్తాడు ఉడవయవర్లు. ఇంటికి వచ్చేటప్పుడు చిట్టిగారెలు తెమ్మంటూ భార్యనుంచి ఫోన్.

ఉస్సురంటూ నిట్టూర్చాడు.

***

''చిట్టిగారెలు చాలా బాగున్నాయండీ. అన్నట్లు మీకో విషయం. మా అన్నయ్యకు జిల్లా అటవీ శాఖాధికారిగా ప్రమోషన్ వచ్చింది. వాడికి దైవభక్తి అంతాయింతా కాదు. మన గుడికి వస్తాడట..'' అంది చిట్టిగారెలు కరకర నమిలి తింటున్న సోమదేవమ్మ.

''తప్పకుండా రమ్మను. దగ్గరుండి దైవదర్శనం చేయిస్తాను'' అన్నాడు ఉడయవర్లు భార్యతో.

''ఆ సమయంలో మా అన్నయ్య కోరిక కూడా మీరు తీర్చాలి'' అభ్యర్థనగా అన్నది సోమదేవమ్మ.

''మీ అన్నయ్య కోరికా? అదేమిటో?'' చిత్రంగా

అడిగాడు ఉడయవర్లు.

''మా అన్నయ్యకు మీ ఆలయంలో పూర్ణకుం భంతో స్వాగతం అందుకోవాలని మహా కోరిగ్గా వుంది. కాస్త వాడి సరదా తీరుద్దురూ!''

ఆ మాట వినటంతోనే ఉడయవర్లుకి చుక్కలు కని పించాయి. నగలు, చీరలు కొనమని పోరే భార్యలుం డటం సహజం. ఇటువంటి కోరిక తీర్చమన్న భార్య వుండదేమో.

''ఇదేమన్నా బజార్లో వస్తువనుకున్నావా! డబ్బు పడేసి పట్టుకురావడానికి'' నిరసనగా అన్నాడు ఉడ యవర్లు.

దాంతో కళ్ళనీళ్ళు పెట్టుకుని ''మీరు నా కోరిక ఎప్పుడు తీర్చారు కనుక. రాకరాక నవమికి వస్తు న్నాడు. వడ్డించేవాడు మనవాడే కదాన్న ధీమాతో కొండంత ఆశ పెట్టుకున్నాడు. అలాటివాడి హోదాకి తగ్గట్లుగా మీరు ఏర్పాట్లు చేయలేరా'' నిష్ఠూరమా డింది సోమదేవమ్మ.

ఉడయవర్లుకి మరో తలపోటు మొదలు.

***

''ఇంతకీ దేవానందరావెవడండీ'' ఇంట్లో చిరా కెత్తి వచ్చాడేమో. ఆలయంలో కూడా అదే చిరాకు ప్రదర్శించాడు ఉడయవర్లు.

''మరెవరు? మన ఎమ్మెల్యే మహాశయుడు. ఆయన తన నియోజకవర్గమంతటినీ వెంటేస్కుని వచ్చేట్లున్నాడు'' అప్పలాచార్యులు విసుగ్గా చెప్పాడు.

అసలే కోవెల తెగ రద్దీగా వున్నది. స్పెషల్ టిక్కెట్ల కౌంటరులోపనిచేసే కోటిబాబు ఏదో ఆపద కబు రొచ్చి పరిగెత్తాడు. అందువల్ల ఇటు టిక్కెట్ కౌంటర్, అటు ప్రసాదాలు చేయించి అమ్మించటం మహా ఇబ్బందయిపోయింది అప్పలాచార్యులుకి.

సరిగ్గా అదే సమయంలో పుట్టు కొప్పులశాల దగ్గర భక్తుడెవరికో జుత్తు గొరుగుతూ నెత్తురోడేలా డెక్కేశాట్ట క్షురకుడు. దాంతో మంటెత్తిపోయి... గగ్గోలు పెడుతూ ఆఫీసు దగ్గరకొచ్చాడు భక్తుడు.

అంతే అప్పలాచార్యులు రివ్వుమని పుట్టుకొప్పుల శాల దగ్గరికి వెళ్ళి ''నీకు మతీసుతీ వుందా లేదా! ఇలా గుళ్ళు డెక్కిపారేస్తే మంటెత్తిపోదూ... మన ఆలయం పరువు తీస్తున్నారు. ఏమిటా విర్రవీగుడు'' అని చెడా మడా చీవాట్లేశాడు.

అసలు గుట్టు మరేం కాదు – మంగలి గుండు గీస్తున్నప్పుడు పైన ఒక బోర్డు వుంది. 'ఇక్కడ మంగ లికి డబ్బులీయనక్కర్లేదు' అని చెబుతూ టిక్కెట్ తీసింది కాక వేరేగా డబ్బులు ఎందుకివ్వాలంటూ అడ్డవాదన మొదలెట్టాట్ట ఆ భక్తశిఖామణి. పోనీ గుండు గొరిగాకయినా తగువు లేవదీశాడు కాదు. ఎలాగూ ఇది ఎఫ్ఫెస్ బాపతేనని ఓ కార్నర్‌లో పెచ్చూడదీసి వదిలాడా మంగలి.

అదే సమయంలో ఎవరో సినిమా యూనిట్ వాళ్ళ తరఫున ఎవడో వచ్చి నవమి ఉత్సవాలు చిత్రీక రించుకుని సినిమాలో సీన్లుగా తగిలించుకుంటా మని, తమ శతచిత్ర దర్శకుడు గజేంద్ర గారికి ఘనంగా స్వాగతం పలికితే టైటిల్స్‌లో దేవాలయం వారి పేర్లన్నీ వేస్తామని అధికారం చెలాయిస్తున్నట్లు మాట్లాడాడు.

ఉడయవర్లుకి నోట మాట రాలేదు. ఆయన లక్షణం కనిపెట్టిన వైకుంఠంగారు – ''ఎవడండి ఆ జులపాల వెధవ. మర్యాదలిలా చేయాలని మనకు చెప్పటానికి వాడెవడని'' అగ్గెత్తారు.

అదే సమయంలో పట్టాభి – ఇందాకా గగ్గోలెత్తిన భక్తుడికి ప్రథమ చికిత్స చేస్తూ కనిపించడంతో ''ఏం పట్టాభీ! ఇదివరకెన్నడయినా మంగలి రావుడి కత్తి రుచి చూశావేంటి? వాడిమీద అంతలా వెర్రెత్తిపోతు న్నావు?'' అడిగాడు అప్పలాచార్యులు.

''అయినా వాడికిదేం పోయేకాలం.. డబ్బులు వడకటం నేర్చాడు'' మండిపోతున్నాడు పట్టాభి.

''నువ్వు మండితే మాకు భయం. పొగుప్పొంగలి లోకి పోపునెక్కడ మాడగొట్టావోనని...'' నవ్వుతూ అన్నారు వైకుంఠంగారు.

''అబ్బే దేనిదారి దానిదే. గగ్గోలు చూసి పరిగెత్తు కొచ్చానంతే'' అని పోటుశాలలోకి వెళ్ళిపోయాడు పట్టాభి.

ఇ.ఓ. ఉడయవర్లుకిదంతా అగమ్యగోచరంగా అనిపిస్తోంది. ఏ అపశృతి దొర్లినా అందరికీ మాటే!

''రేపు ఒక్కరోజు కళ్ళు మూసుకుంటే ఎల్లుండే శ్రీరామనవమి. ఇవ్వాళ్టిదాకా ఏ ఒక్కరూ దిగలేదు. అందరూ కట్టకట్టుకుని దిగబడేలా వున్నారు'' మొహంలో ఆందోళన కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది.

''మీరలా కళ్ళు మూసుకోండి. మీకెందుకండీ బెంగ. మన స్థానాచార్యులు లేరా! అర్చకస్వాములు లేరా'' గుండె దిటవునిచ్చే మాటన్నాడు అప్పలాచా ర్యులు.

ఇంటికెళ్ళినా అదే బెంగ... మరో తలనొప్పి భార్య సోమదేవమ్మ కోర్కె. తన అన్నగార్కి ఘన సత్కా రాలు తప్పని సరంటూ...

జుత్తు పీక్కోవ టమొక్కటే తరు వాయి. ఆ రాత్రి కునుకులేదు ఉడ యవర్లుకి.

***

ముందురోజు రాత్రికే చాలా మంది యాత్రికులు చేరటం వల్ల తెలతె లవారుతూనే దైవ దర్శనానికి భక్తులు బారులు తీరారు.

కలెక్టరు గారు ఉదయాన్నే వచ్చే స్తున్నారని కబురు మోసుకొచ్చాడు అప్పలాచార్యులు. దాంతో వైదిక సిబ్బందంతా సిద్ధ మైంది.

రాత్రి బేడా మీంచి ఎక్కి చూసి ''అయ్యా! ఇ.వో. గారూ కలెక్టర్ గారి కారొచ్చేస్తూం దండి'' అని మరింత హడావుడి చేశాడు మంగలి రావుడు.

ఉడయవర్లు కంగారపడుతూ – ''అయ్యా గోవిందాచార్యులు గారూ.. మీరు పూర్ణకుంభంతో రెడీ అవండి. ఏమోయ్ పట్టాభీ...! నువ్విక్కడ గోళ్ళు గిల్లుకోకపోతే పోటుశాలలో పనిచూడొచ్చు కదా! రత్తాలూ నువ్వెళ్ళి కాళ్ళు కడుక్కోవడాన్కి బిందెతో నీళ్ళు పట్టుకొచ్చి మెట్లదగ్గర పెట్టిరా'' అన్నారు.

అందరూ చూస్తుండగానే కారొచ్చి ఆగింది.


అందులోంచి ఓ భారీకాయం .. నల్లతుమ్మ మొద్దులా ... బానపొట్టతో దిగాడు.

కలెక్టర్ కాదండీ బాబూ! మహాభక్తుడు వీరయ్య శెట్టి! ఇంక పొంగళ్ళంటూ చంపేస్తాడండీ బాబూ'' అని ఒక్కసారి బరువుగా నిట్టూర్చాడు చిన్నఅర్చ కుడు వసుంధరాచార్యులు.

మరో అర్ధగంట ఉత్కంఠ. అనంతరం కలెక్టర్ దిగారు. మెట్లదగ్గరకు రాగానే సిబ్బందంతా సలా ములు సమర్పించారు.

కలెక్టర్ ముకుల్ గార్గ్ గార్కి హిందీ, ఇంగ్లీషు ముక్కలు తప్ప తెలుగు రాదాయె. ఆ అవస్థ గమ నించి పక్కనున్న అనువాదకుడు ఇక్కడి సంప్రదా యాలను వివరించమని అడుగుతున్నట్లుగా ఇ.ఓను కదిపాడు.

ఉడయవర్లు గొంతు విప్పేందుకు సిద్ధమౌతుంటే ఆగమంటూ సైగచేసి తను ఉపక్రమించారు వైకుంఠం గారు. పెరుమాళ్ళు పూనారేమోగాని పాత బి.ఏ. టాలెంటంతా ఒలకబోశారు వైకుంఠం గారు. ఆయన



అనర్గళానికి నోరెళ్ళబెట్టారంతా.

ప్రధాన ద్వారం దగ్గరున్న గోవిందాచార్యులు పూర్ణకుంభంతో ఎదురొచ్చి ధ్వజస్తంభం దాకా తీసుకెళ్ళాక అక్కడ పూర్ణకుంభం తాకమని సైగ చేశారు. పిదప ఓ పూలమాలతో అలంకరించి, వరివేట్టం తలకు చుట్టి బాజాభజంత్రీలతో ... శ్రీసూక్త పురుష సూక్తాలు చదువుతూ ముందుకు సాగారు పండితులు.

సన్నిధి చుట్టూ ప్రదక్షిణల అనంతరం గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. పూజలన్నీ అయ్యాక, కలెక్టర్ గారిని కూర్చోబెట్టి ప్రసాదాదులు ఇచ్చారు. ఆలయ వివరాలన్నీ అడిగి తెలుసుకుని సంతృప్తిచెందాడు కలెక్టర్. ఆయన కుషామస్తుగా వుండటం చూసి ఉడయవర్లు కావలసిన సౌకర్యాలు ఏకరువు పెట్టాడు. భక్తుల నివాసానికి గెస్ట్‌హౌస్‌లు, కల్యాణ మండపం శాంక్షన్ చేస్తూ, ప్రపోజల్స్ వెంటనే పంపమని చెప్పాడు కలెక్టర్.

కలెక్టర్ ఇలా కదిలారో లేదో "ఎస్పీ రెడీ. సంత తోట దగ్గరున్నారు" తోటమాలి పరుగెత్తుకొచ్చి చెప్పాడు.

"అబ్బ! కలెక్టర్‌గారితోపాటే వస్తే.. ఇద్దరికీ స్వాగతం పలికేద్దుం కదా!" అన్నారు వైకుంఠం గారు.

"ఆయనతో కలిసొస్తే ఈయనగారి స్పెషాలిటీ ఏమిటి?" వ్యంగ్యం ఒలికించాడు అప్పలాచార్యులు.

"ఆయన సరదా ఎందుక్కాదనాలి. కానీండి" ఉడయవర్లు సర్దుకున్నాడు.

ఎస్పీగారిని దగ్గరుండి ఆలయానికి తీసుకురమ్మని అప్పలాచార్యులుని పంపాడు ఉడయవర్లు.

సింహద్వారం దగ్గరకు రాగానే మేళతాళాలు మారుమ్రోగాయి. పూర్ణకుంభం స్వాగతం. వరివేట్టం చుట్టడం. ముమ్మారు ప్రదక్షిణ... గర్భగుడిలో పూజలు. వీటితో తెగ పొంగిపోయాడు ఎస్పీ ఆశీర్వాద్.

పోలీసు బందోబస్తు గురించి అడిగాడు ఆశీర్వాద్. సరిపోతుందని చెప్పాడు ఇ.ఓ. ఉడయవర్లు.

ఎస్పీ మెట్లు దిగి వెళ్ళాక ఒకాయన వచ్చి "నేను ఎస్పీగారి పర్సనల్‌ను. నాకు దద్దోజనమంటే మహా ప్రీతి. అర్జంటుగా మరో ప్యాకెట్టివ్వండి" అని నానా తొందరచేసి కాకిలా పట్టుకెళ్ళిపోయాడు.

అదే సమయంలో పట్టాభి చెమట్లు కక్కుకుంటూ వైకుంఠం గారికి ఎదురుపట్టాడు. స్వామికి నైవేద్యం పెట్టడానికి ఇత్తడి గుండిగను కదిలించలేక నానాఅవస్థలు పడ్తున్నట్లు గ్రహించిన వైకుంఠం గారు "ఏమోయ్! నీకూ, అసిస్టెంట్‌కూ తగవులుగాని ముదిరాయా! సాయంకోసం పిలవటం మానేశావు. నీకు పుణ్యం వుంటుందిగాని, ఈ ఒక్కరోజు మీరిద్దరూ కుక్కల్లా కాట్లాడుకోకుండా కార్యం కానీండయ్యా!" అని చీవాట్లు పెట్టారిద్దరికీ.

ఈలోగా లక్ష్మీసన్నిధిలో కూచున్న వైకుంఠంగారి దగ్గరకు వచ్చిన గోవిందాచార్యులు "అయ్యా ముహూర్తం మించిపోకుండా ధృవుల వద్ద పెట్టేద్దామా!" సంశయిస్తూ అడిగాడు.

"అనుమానం ఎందుకు? అలాగే కానీ గోవిందం"

"స్పష్టంగా చెప్పండి స్వామీ! ఓసారి పూర్ణకుంభంను ధృవుల వద్ద వుంచేసిన తరువాత ఉత్సవాలు ముగిసేదాకా మరి కదపటానికి వీల్లేదు కదా" నలిబిలిపడ్డాడు గోవిందాచార్యులు.

"ఎవరొస్తారో రానీండి... నే చూస్కుంటాను" అభయమిచ్చారు వైకుంఠం గారు.

గుండెమీద చేయి వేసుకుని వెళ్ళిపోయాడు గోవిందాచార్యులు.

ఒకవైపు శ్రీరాముని కల్యాణ మహోత్సవ ఆరంభానికి నాందీగా భాగవతోత్తముల వ్యాఖ్యానం వినిపిస్తూంది.

అంతలోనే ఉడయవర్లు హడావిడిగా వచ్చి "ఎమ్మెల్యే దేవానందరావు పి.ఏని పంపాడు. పూర్ణకుంభంతో రమ్మని. ఆ గోవిందాచార్యులుగారేరండి" అన్నాడు చేతి రుమాలుతో చెమట్లు అద్దుకుంటూ.

వైకుంఠం గారు ఇ.ఓ. గారికి మెల్లగా ఉన్న విషయం చెప్పారు.

"కొంప ముంచారండీ! ఇప్పుడు దారిదే" దిగాలు పడ్డాడు ఉడయవర్లు.

"మీకెందుకండీ గాబరా! నేనో ఠస్సా వేస్తాగా... ఇదిగో ఆ వసుంధరాచార్యులును రమ్మనండి. నేనో నిముషంలో పాశుపతాస్త్రం సంధిస్తాను. దీంతో మనలో ఏ ఒక్కరికీ మాటరాదు" అని చేపాటి కర్రతో స్వామి సన్నిధిలోకి నడిచారు వైకుంఠం గారు.

> **అసలే రాజకీయ నాయకులు కదా! అందుకే ధర్మరాజంతటివాడు అబద్ధమాడిన చందంగా ఆపద సమయంలో తప్పలేదు కాబట్టే నేను రోజూ ఇంటి దగ్గర్నుంచి మంచి తీర్థంకని తెచ్చుకునే రాగి కలశాలను అలంకరించి, పూర్ణ కుంభమనిపించాను. కార్యక్రమం ఎటువంటి ఢోకా లేకుండా నడిపించేశాను. మన పెరుమాళ్ళ దగ్గర్నుంచి అసలు పూర్ణకుంభం కదల్చలేదన్న విషయం లోగుట్టుగానే వుంది**

ఇదంతా గజిబిజిగానే వుంది ఉడయవర్లుకి.

ఓ పది నిముషాల్లో వసుంధరాచార్యులు చేతిలో తను తెచ్చినదాన్ని వుంచారు వైకుంఠంగారు.

"ఇదా!" నోరెళ్ళబెట్టాడు ఉడయవర్లు.

"ఔను ఇదే అది... మీరలా చూస్తూండండి. ఏమయ్యా! చేయాల్సింది నువ్వే! గోవిందం ఉత్సవాల దగ్గర కల్యాణం జరిపిస్తున్నాడు. నువ్వే కథ నడిపించాలి. పద... పద" ధైర్యంగా భుజం తట్టారు వైకుంఠం గారు.

ఉడయవర్లుకి అగమ్యం వీడలేదు.

"ఊఁ వాయించండయ్యా మంత్రులూ" (మంగళ్ళను ఆలయాల్లో మంత్రులనటం పరిపాటి) కేకేశాడు అప్పలాచార్యులు.

సన్నాయి మేళం నోరు బార్లా తెరిచింది.

ఎమ్మెల్యే దైవానందరావు చేత కుంభం తాకించి, దండ వేయించి చుట్టూరా ప్రదక్షిణం తిప్పారు. పూజాదికాలు ఎప్పటిలాగే... ఎమ్మెల్యే వెనుక జనం ప్రసాదాలు లాగించడంలో వెనకబడలేదు. హుండీలో వేసింది హుళక్కే.

దైవానందరావు అలా వెళ్ళాడో లేదో...

"అయ్యా! ఉన్న గేదె ఈనసింది. అదేనండీ ఎం.పి. దిగాడు. ఆలయం అవతల నిలుచుని ఇరవై నిముషాలయిందట. తన రాకను ఎవరూ గమనించలేదంటూ ఒకటే రుసరుసలాడ్తున్నాడు. తనకంటే ముందర ఎమ్మెల్యేకి స్వాగతాలాని ఆగ్రహంగా అన్నాడు. వీళ్ళిద్దరిదీ చెరో పార్టీ కావటం కాదుగాని మనం ఛస్తున్నాం" గుమాస్తా అప్పలాచార్యులు లోపాయకారీ భోగట్టా మోసుకువచ్చాడు.

"రెడ్డొచ్చె మొదలెట్టి.. తప్పుతుందా! పంక్తిలో పరపక్షం పనికిరాదుగా... పూర్ణకుంభ స్వాగతాలేగా.. పలికేద్దాం" నవ్వుతూ అన్నారు స్థానాచార్యులు వైకుంఠంగారు.

వసుంధరాచార్యులు తన కర్తవ్యం అక్షరాలా పాటించాడు.

సింహద్వారం దగ్గరకు వచ్చిన ఎం.పి. బసవన్న మొహం చూస్తే కళతప్పినట్లుగా అనిపించింది వైకుంఠం గారికి.

"మీ గురించి కళ్ళు కాయలుకాచేలా చూస్తున్నాం" అని తనదైన శైలిలో వినయం ఒలకబోశారు వైకుంఠం గారు. ఎం.పి. బసవన్నకు కూడా స్వాగతాలు అందరికీ ఎలా జరిగాయో ఆ 'పద్ధతి'లోనే జరిగాయి.

"కాసేపు కల్యాణ మంటపంలో కూచోండి. కల్యాణం తిలకించి వెళ్దురుగాని" వినయం బాణీ మార్చలేదు వైకుంఠం గారు.

కొంతసేపు గడిపి వెళ్ళిపోయారు బసవన్న, అతని అనుయాయులు.

"ఈ చివరి నిముషంలోగాని మరెవరూ దిగబడరు గదా!" ఇంకా బెంగ వెంటాడుతూనే వున్నది ఉడయవర్లుని.

"ఎంతమంది రానీండి. నే చూస్కుంటాను" భరోసా ఇచ్చారు వైకుంఠం గారు.

కల్యాణం తంతు పూర్తయ్యేదాకా ఆగి, ఇక ఉగ్గబట్టుకోలేక అడిగేశాడు ఉడయవర్లు.

"మీ సందేహానికి అర్థం లేకపోలేదు. కలెక్టరు, ఎస్పీ వెళ్ళిపోయాక పెరుమాళ్ళ దగ్గరుంచిన పూర్ణకుంభం ఎలా కదిపారా అని. నిజమే ఉత్సవం మొదలైనాక ధృవుల దగ్గర్నుంచి కదపకూడదు గాని, వచ్చిన వారికి స్వాగతాలు పలకకపోతే ఊరుకుంటారా! అసలే రాజకీయ నాయకులు కదా! అందుకే ధర్మరాజంతటివాడు అబద్ధమాడిన చందంగా ఆపద సమయంలో తప్పలేదు కాబట్టే నేను రోజూ ఇంటి దగ్గర్నుంచి మంచి తీర్థంకని తెచ్చుకునే రాగి కలశాలను అలంకరించి, పూర్ణకుంభమనిపించాను. కార్యక్రమం ఎటువంటి ఢోకా లేకుండా నడిపించేశాను. మన పెరుమాళ్ళ దగ్గర్నుంచి అసలు పూర్ణకుంభం కదల్చలేదన్న విషయం లోగుట్టుగానే వుంది" అన్నారు నవ్వుతూ.

"లోగుట్టు పెరుమాళ్ళకెరుక" తనూ నవ్వేశాడు అప్పలాచార్యులు.

ఉడయవర్లు సంతృప్తితో ఇల్లు చేరాడు.

భార్య సోమదేవమ్మ మొహం మాడిపోయి వున్నది. ఉడయవర్లు మాట్లాడబోయాడు.

"హుఁ! నాతో మాట్లాడద్దు. మా అన్నయ్య మీకోసం పడిగాపులు పడి మీరు పట్టించుకోలేదని వెర్రెత్తిపోయి రైలెక్కేశాడు" అంది.

"రక్షించాడు" అనుకున్నాడు ఉడయవర్లు హాయిగా ఊపిరి పీలుస్తూ.

★